క్లుప్తంగా

నేటి నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు

సంతనూతలపాడు: సంతనూతలపాడు ఆర్య వైశ్య కళ్యాణ మండపంలోని సీతారామ వారి నిత్య భజన మందిరంలో సోమవారం నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆర్యవైశ్య కళ్యాణ మండప కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన సారంగి ఎల్లయ్య, వీర ముష్టి బృందం ఆధ్వర్యంలో ఈ ప్రభ, దండకాలు, నారసాలు, వీరంగం వేడుకలను ఈ సందర్భంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

బాలురకు ఒడుగుల సేవ



కార్యక్రమంలో పాల్గొన్న షాహిన్ గ్రానైట్ యజమాని అజీమ్

చీమకుర్తి: చీమకుర్తిలోని షాదీఖానాలో 27 మంది బాలురకు ఆదివారం ఒడుగుల సేవా కార్యక్రమం నిర్వహించారు. షాహిన్ గ్రానైట్ యజమాని ఎంఏ అజీమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒంగోలుకు చెందిన అబ్దుల్ రహీం మౌలానా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి బాలురకు ఉచితంగా మందులు అందించారు.

300 మందికి మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు, వాసవీ క్లబ్ సభ్యులు

సంతనూతలపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్లో ఆదివారం వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో నాలుగో వారం మజ్జిగ పంపిణీ చేశారు. 300 మందికిపైగా మజ్జిగ పంపిణీ చేశారు. దాతలు గ్రంధి లక్ష్మీప్రసాదరావు, సులోచన దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ కూలింగ్ చలివేంద్రం వద్ద దమ్మల వెంకట సుబ్బారావు, సుబ్బరత్నం జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీనివాసరావు, సురేష్, బాలాజీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ పొంగళ్లు



అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ ఆలయ 100వ వార్షిక తిరునాళ్ల అనంతరం ఆదివారం భక్తులు నెల పొంగళ్లు పెట్టారు. ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు పి.విజయలక్ష్మి, మెట్టెల బాలరాజు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తురకపాలెం గ్రామ ప్రజలు 35 ట్రాక్టర్లను అలంకరించి కుటుంబ సమేతంగా దేవస్థానం చుట్టూ ప్రదక్షిణ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారికి నైవేద్యం, కానుకలు సమర్పించిన అనంతరం జంతు బలి ఇచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయం పక్కన ఉన్న పుట్ట, నాగశిలలు, మల్లికార్జునస్వామి వారికి పూజలు చేశారు. ఈఓ జి.వాసుబాబు, ఆలయ కమిటీ చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

వైభవంగా చేజర్లమ్మ తిరునాళ్లు



పూజలందుకుంటున్న చేజర్లమ్మ



విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారి ఆలయం



తిరునాళ్లలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ

ఒంగోలు సిటీ: మండల పరిధిలోని చేజర్ల గ్రామంలో వేంచేసియున్న చేజర్ల అమ్మవారి ఆలయ తిరునాళ్లను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఒంగోలు నగరం, ఒంగోలు రూరల్ మండలం పరిధిలోని గ్రామాలతో పాటు కొత్తపట్నం మండలం నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. మొదటిగా అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. ఆలయ పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, పురుషులు చేజర్లమ్మను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుని కానుకలు సమర్పించారు. భక్తులందరికీ అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ ఎంతగానో ఆకట్టుకుంది. విద్యుద్దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

శోభాయమానంగా వాసవీ బైక్ ర్యాలీ



తలపాగలతో బైక్ ర్యాలీలో పాల్గొన్న హిందూ మహిళా భక్తులు



వాసవీ బైక్ ర్యాలీలో పాల్గొన్న తదియారాధన సంఘ సభ్యులు

- అట్టహాసంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు

ఒంగోలు మెట్రో: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం ఒంగోలు నగరంలో అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక గాంధీరోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం తదియారాధన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు వాసవీ బైక్ ర్యాలీని అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. హిందూ బంధువులు, అమ్మవారి భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలను ఆలయ అర్చకుడు మణిశర్మ నిర్వహించారు. ఒంగోలు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కాషాయపతాకాలు చేతబట్టి పసుపు, ఎరుపు తలపాగాలు చుట్టి ద్విచక్ర వాహనాలపై 400 మంది యువతీ యువకులు ర్యాలీ నిర్వహించారు. గాంధీరోడ్డు, దక్షిణం బజారు, ఏనుగుచెట్టువీధి, పప్పుబజారు, పత్తివారివీధి, పాత కూరగాయల మార్కెట్, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, రాంనగర్ మొదటి లైన్ మీదుగా ట్రంకు రోడ్డు, కలెక్టరేట్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, గ్రంథాలయం, లాయర్‌పేట చిట్టి ఆంజనేయస్వామి దేవస్థానం, ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ బిల్డింగ్, గాంధీరోడ్డు బంగారుకొట్ల సెంటర్ మీదుగా అమ్మవారి దేవస్థానం వరకు భారీ బైక్ ర్యాలీ జరిగింది. ర్యాలీలో పాల్గొన్న వారిపై పువ్వులు చల్లడం ఆకట్టుకుంది. ర్యాలీ మార్గం అంతా జై వాసవీ.. జైజై వాసవీ నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా తొలిసారి ఒంగోలులో అమ్మవారి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా వాసవీ బైక్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని కమిటీ సభ్యులను అభినందించారు. అమ్మవారు చెప్పిన అహింస, త్యాగం, శాంతి, సహనం లక్షణాలను ప్రతిఒక్కరూ జీవితంలో అలవరచుకోవాలని కోరారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

- జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య



కొత్తపట్నం బస్టాండ్ వద్ద జెండా ఆవిష్కరిస్తున్న శ్రీరాములు

కొత్తపట్నం: కార్మికుల హక్కుల కోసం నిత్యం పోరాడాలని, పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య అన్నారు. మే డే వారోత్సవాల్లో భాగంగా సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో, రంగాయపాలెం, వలసపాలెంలోని పార్టీ కార్యాలయాల వద్ద పార్టీ జెండాలు ఆవిష్కరించారు. వాటంబేటి శ్రీరాములు చేతుల మీదుగా జెండాలు ఆవిష్కరించగా, కృష్ణయ్య మాట్లాడుతూ ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికవర్గం పోరాడి 139 సంవత్సరాలైందని తెలిపారు. దీనిని పురస్కరించుకుని మే డే వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. ఆనాడు రోజుకు 12, 16, 18 గంటల పాటు పనిచేయించుకుని ఒక పద్ధతి లేకుండా ఉండే సమయంలో అనేక పోరాటాలు చేసి రోజుకు 8 గంటల పని హక్కును సాధించుకున్నామన్నారు. ఈ పోరాటంలో ఎంతో మంది కార్మికులు మరణించారన్నారు. ఈ రోజు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగి ఎన్నో యంత్రాలు వచ్చాయని, అయినప్పటికీ పనిభారం పెరిగి రాత్రీపగలూ తేడా లేకుండా కార్మికులు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన ప్రధాని నరేంద్రమోదీ వారానికి 90 గంటలు పనిచేస్తున్నారని, మీరెందుకు పనిచేయరంటూ బడా పారిశ్రామికవేత్తలతో మోదీ మాట్లాడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని ఎదుర్కొని మనం సాధించుకున్న హక్కులను ఎలాగైనా కాపాడుకోవాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. అనంతరం కోడూరి తిరుపతమ్మ మే డే పాటలు ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జనసాహితి జిల్లా నాయకుడు డి.వెంకటేశ్వరరెడ్డి, సీపీఐ (ఎంఎల్) జిల్లా సెక్రటరీ దావూరి స్వాములు, రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షురాలు శిరిగిరి లలితమ్మ, రైతు కూలీ సంఘ జిల్లా నాయకులు కోడూరి కోటేశ్వరరావు, బక్కా శ్రీనివాసరావు, శేఖరు, పెద్దాబ్బాయి, ప్రసాద్, కరుణ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల జీతాలు నిలిపివేయడం హేయం

- నిరవధిక దీక్షల్లో ఏపీఎంసీఏ నాయకులు



కలెక్టరేట్ వద్ద దీక్షలో పాల్గొన్న సీహెచ్‌ఓలు

ఒంగోలు టౌన్: న్యాయమైన హక్కుల సాధన కోసం సమ్మె చేస్తున్న సీహెచ్‌ఓల జీతాలను ప్రభుత్వం నిలిపివేయడం హేయమైన చర్య అని ఏపీఎంసీఏ నాయకులు విమర్శించారు. స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న నిరవధిక దీక్షల్లో ఆదివారం పాల్గొని వారు మాట్లాడారు. ఏడేళ్ల నుంచి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న సీహెచ్‌ఓల ఆర్థిక ప్రయోజనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం గత ఆరు రోజులుగా సమ్మె చేస్తుంటే.. వారి జీతాలు నిలిపివేసి ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అంతేగాకుండా సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రికి వినతి పత్రం అందజేయడానికి వెళ్తే.. మీరు కాంట్రాక్ట్ ఉద్యోగులు మాత్రమేనని, మిమ్మల్ని ఉద్యోగం నుంచి తీసేస్తానంటూ దురుసుగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. సీహెచ్‌ఓల వ్యవస్థ గురించి చేసిన అనుచిత వ్యాఖ్యలను మంత్రి వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరవధిక దీక్షలలో పాల్గొన్న సీహెచ్‌ఓలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. దీక్షలలో ఏపీఎంసీఏ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రసన్న, ఉపాధ్యక్షురాలు జీవన జ్యోతి, రామాంజనేయులు, కామేష్, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

కర్ణాటక సంగీతానికి ప్రత్యేక స్థానం



ప్రవచకుడు పొన్నూరు శ్రీనివాసులను సన్మానిస్తున్న త్యాగరాజ సేవా సమితి నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: ప్రపంచ సంగీత చరిత్రలో త్యాగరాజస్వామి కర్ణాటక సంగీతానికి సమున్నతమైన స్థానం ఉందని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. త్యాగరాజస్వామి జయంతి సందర్భంగా స్థానిక మంగమూరు రోడ్డులోని గాయత్రి అమ్మవారి మందిరంలో త్యాగరాజ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పొన్నూరు శ్రీనివాసులు పాల్గొన్నారు. త్యాగరాజస్వామి జీవితం కృతుల పరమార్థం అనే అంశంపై ప్రసంగించారు. సంగీత జ్ఞానానికి భక్తికి మించిన సాధన లేదని నమ్మి నాదోపాసన ద్వారా రాముడిలో ఐక్యమైపోయిన తెలుగు వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి అని కొనియాడారు. త్యాగరాజస్వామి పూర్వీకులు ప్రకాశం జిల్లా కాకర్లకు చెందిన వారు కావడం జిల్లా చేసుకున్న అదృష్టంగా అభివర్ణించారు. 24 వేల కృతులను రచించి సంగీతానికే దిశానిర్దేశం చేశారని అన్నారు. వారి జీవితంలోని మధురమైన ఘట్టాలను, కృతులలోని పరమార్థాలను తన ప్రసంగం ద్వారా రసరమ్యంగా పలికించి ప్రేక్షకుల కరతాల ధ్వనులు అందుకున్నారని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు పిన్నంరాజు నరసింహారావు, సభ్యులు కలిసి ఉపన్యాసకుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. అనంతరం వసుంధర, నాగలక్ష్మి, మానసి, ప్రవల్లిక, దేవసేనల వీణా నాదం అలరించింది. త్యాగరాజస్వామి ఆరాధన జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను పలువురు అభినందించారు.

వేడుకగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి విగ్రహ పూజలో పాల్గొన్న సంఘ నాయకులు

ఒంగోలు మెట్రో: సగర (ఉప్పర) కుల మూల పురుషుడు విరాట్ శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా సగర ఉప్పర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జూటూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భగీరథ మహర్షికి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాబోయే సంవత్సరం భగీరథ మహర్షి జయంతి రోజు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని జూటూరి కోరారు. సగర కులస్తులు ఎక్కువ శాతం గృహనిర్మాణ పనులు చేసుకుంటూ ఉంటారన్నారు. ప్రభుత్వం 50 సంవత్సరాలకే తమకు పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా సగర (ఉప్పర) సంఘ ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, ఒంగోలు నగర అధ్యక్షుడు రెడ్డి పరమేశ్వరరావు, సలహాదారులు వెంకటకృష్ణ, నాయకులు వెంకట నారాయణ, శ్రీనివాసులు, కొండా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంతమ్మకు బూచేపల్లి, మేరుగు నివాళులు



కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి, మేరుగు

చీమకుర్తి రూరల్: మండలంలోని జీఎల్ పురం గ్రామంలో అఖిల భారత న్యాయమూర్తుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు మాతృమూర్తి కాంతమ్మ పెద్దకర్మకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సంతనూతలపాడు ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున హాజరై పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు బట్టు దేవానంద్, ఎం.సుధీర్‌కుమార్, విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు, బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచ్ మన్నం వెంకటరావు, మండల రైతు విభాగం అధ్యక్షుడు నల్లూరి రామచంద్రరావు, కొల్లూరి శివన్నారాయణ, చెన్నకృష్ణ, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, సుంకర శ్రీను, తదితరులు పాల్గొని కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

బాలగంగమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి మేరుగు



గార్లపాడులో బాలగంగమ్మను దర్శించుకుంటున్న మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు

మద్దిపాడు: మండలంలోని పాత గార్లపాడు గ్రామం వద్ద ఉన్న బాలగంగమ్మ ఆలయంలో అమ్మవారిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ఆదివారం మధ్యాహ్నం దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రావూరి ప్రసన్నాంజనేయరెడ్డి మొక్కు ఉన్న క్రమంలో మేరుగు నాగార్జున పాల్గొని ఆలయంలో బాలగంగమ్మ తల్లిని దర్శించున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త తల్లి మృతికి సంతాపం...

మద్దిపాడు మండలంలోని బూరేపల్లి పునరావాసకాలనీలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కావూరి ఏసోబు తల్లి లేయమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున నివాళులర్పించి ఏసోబును పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మద్దిపాడు మండల ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బెజవాడ రాము, నాయకులు పాకనాటి మహానందరెడ్డి, యల్లమందారెడ్డి, పిచ్చిరాజు, గుడ్డపాతల రవి, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు సంధ్య, రజని, నాదెండ్ల మహేష్, ఎంపీటీసీ పద్మ, రామాంజనేయులు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారుమూరిని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



కారుమూరికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఆ పార్టీ స్థానిక నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ నగరికంటి శ్రీనివాసరావు, ఒంగోలు సిటీ ప్రెసిడెంట్ కె.సంపత్‌కుమార్, సిటీ సమాచార హక్కు విభాగం నాయకుడు షేక్ హిదయతుల్ల, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో కష్టపడే వారికి సముచిత స్థానం



దుంపా రమణమ్మ, చెంచిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న తేళ్ల అనిల్, తదితరులు

- పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ చెంచిరెడ్డి

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అన్నారు. ఇటీవల పార్టీ అనుబంధ విభాగాల మండల కమిటీలో అధిక సంఖ్యలో నాయకులకు చోటు కల్పిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ హోదాల్లో నియమితులైన వారంతా ఆదివారం దుంపా రమణమ్మ, చెంచిరెడ్డి దంపతులను స్థానిక వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తమ నియామకాలకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దుంపా చెంచిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో పదవులు పొందిన వారంతా క్షేత్రస్థాయిలో సైనికుల్లా పనిచేసి పార్టీని బలపేతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పబ్లిసిటీ వింగ్ మండల కమిటీ ప్రెసిడెంట్ తేళ్ల అనిల్, బుట్టి వెంకట్రావు, బుట్టి పేరేష్ బాబు, తేళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.